# 9. తాబేళ్లు

చీఫ్ యింజనీరుగారు ఫీల్డు మైకులో మాట్లాడుతున్నారు.

"మరొక్క పదినిముషాలలో పని ప్రారంభించాలి. పోలీసువారి పరిశోధన ముగిసింది. ముందుపడిన యింజనులు ఒకరు, పట్టాలు తప్పిన పెట్టెలను మరొకరు, ఇద్దరు యింజనీర్లు ఎత్తించి, రైలుదారి బాగు చేయాలి. రేపు మధ్యాహ్నం పండ్రెండు గంటలవేళకు రైళ్ళు మామూలుగా నడవాలి."

చీఫ్ యింజనీరుగారంటే క్రింది వాళ్లకు సింహస్వప్నం. అన్న నిమిషానికి పని పూర్తి కాకపోతే చాలా యిబ్బందులు పడవలసి వస్తుంది.

రెండు ఇంజనులూ పట్టాలు తప్పాయి. ముందుది పట్టాలు తప్పి రాళ్ళలో నిలుచుంది. రెండవది వెల్లకిల పడి చక్రాలు ఆకాశానికి చూపించుతున్నది.

ఇంజనుల వెనుకనున్న నాలుగు పెట్టెలు పట్టాలు తప్పినవి. డ్రైవర్లకు చిన్న గాయాలు తగిలాయి. కొంతమంది ప్రయాణికులకు కూడా చిన్నచిన్న దెబ్బలు తగిలాయి. ప్రథమ చికిత్స కోసం కూడా చూడకుండా కొంతమంది పారిపోయారు. రైలు మరొక్క పదినిమిషాలలో నగరం చేరుకోవలసింది. ఇంతలోనే ఈ ప్రమాదం సంభవించింది.

రాత్రి తొమ్మిది గంటలవేళ ప్రమాదం జరిగింది. మరొక్క గంటలోనే స్టేషనునుండి, నగరంనుండి పోలీసులు, డాక్టర్లు, రైల్వేవారు అందరూ వచ్చారు. అప్పటినుంచీ జనంలో వార్త అల్లుకుపోయింది. ప్రజలు మాఘమాసపు చలిని కూడా లక్ష్యపెట్టకుండా వచ్చిపడ్డారు.

వెంటనే ఏమి చేయడానికి వీలయింది కాదు. ప్రయాణీకులలో చాలామంది ప్రాణాలు దక్కినందుకు పిట్టలలా ఎగిరిపోయారు. మిగిలిన వారిని స్టేషనుకు పంపించారు.

రాత్రికి రాత్రే అక్కడ పనివాళ్ళు గుడారాలు వేశారు. లైట్లు పెట్టారు. ఫీల్డు మైకు, లౌడుస్పీకర్లు అమర్చారు. ప్రతి పదినిమిషాలకు హెచ్చరిస్తున్నారు. పైనుంచి పెద్దవాళ్లు తెల్లవారేసరికి చేరుకున్నారు. అంతవరకు ఏ పని చేయలేదు. తరువాత కూడా చేయడానికి పోలీసుల ఆచూకీ పూర్తి కాలేదు. రాత్రి గడిచిపోయింది.

మధ్యాహ్నం దక్షిణంనుంచి ఒక జట్టు వచ్చింది. చిన్న యింజనీరు రావు, ఇద్దరు ఫోర్మెనులు, పనివాళ్ళు వచ్చారు బళ్లనెత్తడానికి. ఉత్తరం నుండి ఒక జట్టు ఇంజనులని ఎత్తడానికి వచ్చింది.

కాని, పని మొదలు పెట్టడానికి వీలుకాలేదు. పోలీసులు ప్రదేశాన్ని చుట్టుముట్టారు. తెల్లవారిన దగ్గరనుండి ప్రజలు రావడం హెచ్చయింది. అదొక యాత్రాస్థలంగా మారిపోయింది. పిన్నలు, పెద్దలు, స్త్రీలు . . .. అందరూ వస్తున్నారు. వాళ్ళకోసం టీ దుకాణాలు, పకోడీ దుకాణాలు, వేరుశనగ తట్టలు రావడం మొదలయాయి.

ప్రమాదం జరిగినచోటు ఒక కటింగ్‌లో ఉంది. ఎత్తయిన దిబ్బకోసి లైనులు వేశారు. పట్టాలు తప్పిన నాలుగు పెట్టెలలో మొదటిది ఎడమవేపు దిబ్బ పైకెక్కి వెనుక చక్రాలమీద నిలుచుంది. రెండవది కుడిచేతివేపు దూసుకుపోయి దిబ్బను దున్నిపారేసింది. మూడవది పార్శెలు పెట్టి -అది మధ్యకు రెండు ముక్కలుగా విరిగింది. పైనున్న రేకు పట్టుతో కలిపి ఉంది. నాలుగవది పట్టాలు తప్పి నిలుచుంది. ఆ వెనుక పెట్టెలు పోలీసులు, రైల్వేవారు ఉండటానికి తాత్కాలికమైన ఆశ్రయ మిచ్చాయి.

దక్షిణం నుంచి వచ్చిన రావు రాగానే అంతటా తిరిగి వచ్చాడు. రైలు పట్టాలు ఎవరో వేరుచేశారు. ఎగువకు పోయే లైను. దిగువకుపోయే లైను కూడా ఈ ప్రమాదంవల్ల రాకపోకలకు వీలుకాకుండా పోయాయి. ఆ రెండు లైన్లమధ్య రావుకొక వింతదృశ్యం కనుపించింది. అక్కడో ఎముకులకుప్ప ఉంది. చిరిగిన ఆడవాళ్ల రవికలు ఉన్నవి. పనికిరాని చింకిజోళ్లు, తల వెంట్రుకల చుట్టలు, మానవులు పుర్రెలు ఉన్నవి. వాటిపక్కనే రైలుపట్టాలు వేరయి, ప్రమాదం సంభవించింది. ఈ అమంగళకరమైన వస్తువులకు, జరిగిన రైలుప్రమాదానికి ఏమి సంబంధం . . . ఏదో ఉంది కాబోలు ...ఎవరు వేరయారో ....ఎవరు తిరిగి రాలేదో....

రావు, ఫోర్మెనులు తిరుగుతున్నారు. పోలీసులు అనుమతి యిచ్చేవరకు తిరుగుతున్నారు. ఏ పెట్టెలను ముందు ఎత్తాలో, ఏ పెట్టెలను కోసి వేరుచేయాలో, ఎంతమంది పనివారిని ఎక్కడ వినియోగించడమో ఆలోచిస్తున్నారు.

సాయంకాలం వేళకి పోలీసుకుక్కలు వచ్చాయి. అవి అంతటా తిరిగి ఎవరినీ గుర్తుపట్టలేక పోయాయి. అప్పటితో పోలీసులు అనుమతించారు రైలుపెట్టెలను ఎత్తటానికి. అప్పుడే ఛీఫ్ యింజనీరుగారు మైకులో ఆర్డర్లిచ్చారు చిన్న యింజనీర్లకి.

పట్టాల మీదనున్న పెట్టెలను వెనుకకు తీసుకొనిపోయారు. తరువాత పడిపోయిన నాలుగవ పెట్టెను పట్టాలమీద నిలబెట్టి వెనుకకు లాగేశారు. చెడిపోయిన రైలులైను బాగుచేసుకుంటూ ముందుకు వచ్చేసరికి రాత్రి పన్నెండు గంటలవేళ అయింది.

అపుడు విరిగిన మూడో పెట్టె దగ్గరికి వచ్చాడు రావు. అంతవరకు వచ్చిపోతున్నాడు గాని దీక్షగా అక్కడ నిలబడి ఉండలేదు. పెట్రోమాక్సులైట్ల వెలుతురులో ఆ విరిగిన పార్శెలు పెట్టెను చూస్తున్నాడు.

ఛీఫ్ యింజనీరుగారు ఇంతలో అక్కడికి వచ్చారు. దానిని గాస్‌తో కోయాలి. గాస్ సిలిండర్‌లు అక్కడకు తెచ్చి పైపులు తగిలిస్తున్నారు.

"రావ్! ఈ పెట్టెను తీసివేయడానికి ఎంతకాలం పడుతుంది?" అడిగారు చటర్జీగారు.

"అవునుసార్! -అవును!-" అన్నాడు పరధ్యానంగా రావు.

"అవునేమిటి?" కోపంగా ప్రశ్నించాడు ఛీఫ్.

"చూడండి సార్! - ఇంత వరకు అవి చచ్చిపోయిన వనుకున్నాను కాని కాళ్ళు ఆడిస్తున్నవి -"

ఛీఫ్ చూచారు.

'పొద్దున్నే చెప్పాను. వీటిని తీసుకొని పొమ్మని -కాని ఎవరూ రాలేదా?"

"రాలేదు సార్!"

ఛీఫ్ వెళ్ళిపోయారు. తిరిగి మైకులో మాట్లాడారు - పార్శెలు పెట్టెలోనున్న తాబేళ్ళను తీసుకొనిపొమ్మని.

కాని ఎవరూ రాలేదు. మనుషులందరూ చెల్లాచెదరై పోయారు. వాటిని తీసుకొని పోవలసిన సిబ్బంది, పనిచేస్తున్న వాళ్ళకు రొట్టెలు,టీ తేవడానికి ట్రక్కులో బజారుకి వెళ్ళిపోయారు.

రావు చూస్తూ నిలబడ్డాడు - మధ్యాహ్నం సంగతులు అతని మనస్సులో కదులుతున్నాయి.

గుట్టమీద నుంచి విసురుగా ఒక పడుచు, ఒక కాలేజీ విద్యార్థి క్రిందికి దిగి ఒక్కసారిగా ఆగిపోయారు.

"చూడు! ఎంత పెద్దవో ఈ తాబేళ్ళు? కాని వాటి మెడలు ఎంత చిన్నవో - మనుషులను చూచి వాటిని లోపలికి ముడుచుకుంటాయి. భయంతో -"

వాళ్ళు వెళ్ళిపోయారు.

ఒక చిన్న కుర్రాడూ, వాడి తండ్రి కాబోలు దిగి వచ్చారు.

"నాన్నా! - ఈ తాబేళ్ళను ఇలా వీపుమీద పడేశారేం?"

"పారిపోతాయని -"

"అవి నడవనే లేవుకదా? - ఎలా పారిపోతాయి"

"అలాగే మెల్లగా పారిపోతాయి - నీరు దొరికిందంటే మరి పట్టుకోలేం."

వాళ్లుకూడా వెళ్ళిపోయారు. తరవాత ఎవరో పెద్ద మనుష్యులు, పంచెలు, వాచీలు, చేతికడ్రల వాళ్లొచ్చారు ...వ్యాపార సరళిలో మాట్లాడుతున్నారు...

"పూరీలో ఈ తాబేలు ధర అయిదు రూపాయలు మాత్రమే... కలకత్తాలో ఎంతో తెలుసా. రమారమి నూరు రూపాయలు. మామూలువాళ్ళు తినేదనా మీ అభిప్రాయం! పూరీ తాబేలుకు గ్రాండ్ హోటలులో మంచి గిరాకీ...దొరలు పడిచస్తారయ్యా వీటి కోసం"

రావుకన్నీ వినిపిస్తున్నాయి. ఎదురుగుండా ఉన్న అరలో మూడు తాబేళ్ళున్నాయి. రెండూ పక్క కాలువలో ఉన్నాయి. అరలోని తాబేళ్ళలో రెండు వెనుకకి ఉన్నాయి. ఒకటి ముందుకొచ్చి ఉంది. అది విరిగిన అరమీద వెల్లకిలా పడిఉంది. దానిమెడ దిగువకు వేలాడుతూ ఉంది. దాన్ని లోపలికి తీసుకోవాలని అది ప్రయత్నం చేస్తూ ఉంది. కాని మెడ వ్రేలాడుతూనే ఉంది.

దిగువకు వేలాడుతున్న తలలో రెండు కళ్ళున్నవి. ఆ కళ్ళు ఉబ్బి ఉన్నవి. రెప్పలు లేనికళ్ళు అరిగిన గోళీకాయలలా కనిపిస్తున్నాయి. ఆ చిన్నకళ్ళ నుండి అప్పుడప్పుడు ఒకటి రెండు చిక్కటి చుక్కలు పడుతున్నవి ... అవి అలానే ఉన్నవి...మధ్యాహ్నంనుంచి ...కాదు కాదు... ప్రమాదం జరిగిన రాత్రి నుండి...

"పని మానేసి ఏం చూస్తున్నావు, రావ్?" భుజంమీద చేయివేసి అడిగారు ఛీఫ్ యింజనీరుగారు.

"ఈ తాబేళ్లే సార్! -"

"పాపం!..."

"ఏం చేయడమో నాకు తోచకుండా ఉంది సార్..."

"ఏముంది....అవి ఉన్నాలేనట్లే...ఇప్పటికే చాలకాలం వీటికే వ్యర్థమయింది."

"అవి బాధతో కన్నీళ్లు కారుస్తున్నవి సార్..."

"రావ్...అవి కన్నీళ్లు కావు....నాకీ విషయం తెలుసు...పడేవవి నెత్తురు చుక్కలు...పట్టుకున్న తరువాత ఈ తాబేళ్లు ఎక్కడికీ పారిపోకుండా కళ్లు పొడిచేస్తారు...అవి ఒకంతటికి చావవు... ఎంత మరణబాధకైనా నిలబడతాయి..."

"ఏం చేయడం?"

"ఈ చచ్చే తాబేళ్ళ కోసం మరీ, కాలం వ్యర్థం చేయడానికి వీలు లేదు"

ఆయన వెళ్ళిపోయారు. ఇది ఆజ్ఞ.

వెల్డరు నారాయణ ముందుకు వచ్చాడు. వేగం విరిగిన పార్శిలు పెట్టె పై కప్పు కోయడానికి మీద కెక్కాడు.

నీలి మంట...అదీ ఇనుపరేకును తాకి పంగపండు రంగుగా మారింది. నిప్పురవ్వలు...కాకరపూలు...అవి పక్కను కాలువలో పడిన తాబేళ్ల మీద ముందు పడ్డవి. వాటి చురకలకి అవి ఇటు అటు గాలిలో కాళ్ళు ఆడిస్తున్నవి.

తరువాత మీదనున్న తాబేలుపై నిప్పురవ్వలు పడడం మొదలయింది. మొదట ఒకటి రెండు....తరువాత జల్లులుగా పడుతున్నవి. కప్పులేని దాని కడుపుమీద అవి వాతలు పెడుతున్నవి.

అది కాళ్ళను గాలిలో విదలిస్తున్నది...తల ఇటు అటు తిప్పుతున్నది.

"నారాయణా!....ఒక్క క్షణం ఆపు ...ఆ తాబేలును పక్కకు తప్పించి..."

రావు మాటలు పూర్తి కాకుండా, వెనుక నున్న ఛీఫ్ యింజనీరు అతని భుజం తట్టారు.

"పని ఆగడానికి వీలులేదు ...అప్పుడే రెండుగంటల రాత్రి దాటింది. ఇంకా రెండు పెట్టెలు ఎత్తవలసి ఉంది. ఒక్క నిముషంకాదు. ఒక సెకండు కాలం వ్యర్థమయినా, అనుకున్న వేళకు రైళ్ళు నడపడానికి అవలేదు" అన్నారాయన.

నారాయణ తొందరా కోస్తున్నాడు...నిప్పుల రవ్వలు కావవి...కాకరపూలు కావవి...అవి కరుగుతున్న లోహపుధారలు...కప్పులేని మెత్తటి తాబేలు కడుపుమీద పడుతున్నవి. అవి వాతలు పెట్టటం లేదు...మర్మాలను ఛేధిస్తున్నవి...తాబేలు విలయతాండవ మాడుతున్నది. కళ్ళంట ధారలు కారుతున్నవి...దాని కళ్ళు, ముఖం మరీ ఉబ్బినవి.

ఠప్!...అంతవరకు పైరేకుతో కలిపిన రెండు ముక్కలు ఒక్కసారి విడిపోయాయి. తాబేలు పడుతున్న బాధకు అది అంతం ...కపాల మోక్షం కాబోలు...ఆ తాబేలు పరలోకాలకు వెళ్ళిపోతుంది.

రావు అదిరిపడ్డారు...అంతవరకు వెనుకనే ఉండి చూస్తున్న ఛీఫ్ వెళ్ళిపోయారు...క్రేను ముందుకు వచ్చింది. ఆ పెట్టె ముక్కలను తాబేళ్ళను ఎత్తి, వెనుకకు తీసుకొనిపోయి, దూరంగా పారేసి వచ్చింది.

"అప్పారావూ!... ఆ తాబేలు చచ్చిపోయిందా?..." తిరిగి వచ్చిన క్రేను డ్రైవరును అడిగాడు రావు.

"లేదు సార్!... ఆ పెట్టె దూరంగా పారేసిన తరువాత చూచాను సార్!...అప్పటికీ అది తల తిప్పి, కాళ్ళు ఆడిస్తున్నది..."

కపాలమోక్షం పెట్టెకు?...తాబేలు ఎందుకు బ్రతికి ఉంది...

అనుకున్న వేళకు రైళ్ళు నడిచాయి. రావు పరివారాన్ని తీసుకొని దక్షిణానికి వెళ్ళిపోయాడు.

ఛీఫ్ యింజనీరు ఛటర్జీగారు మాత్రం ఉండి పోయారు...రెండు రోజులయి అతను ఒకచోట కూర్చొని నాలుగు మెతుకులు తిన్లేదు...నడుస్తూనే టీ త్రాగడం, రొట్టె ముక్కలు నమలడం చేస్తున్నాడు...సాయంకాలం శుభ్రంగా స్నానం చేసుకొని, రాత్రి భోజనానికి ఊరిలో నున్న పెద్ద హోటలుకి వెళ్ళి పోయాడు.

బేరరు వచ్చాడు. ఆయన పూర్తి డిన్నరు ఆర్డరుచేశాడు. బేరరు వచ్చేవరకు ప్రక్కనే వున్న మెనూకార్డు చూచాడు...

వరుసగా చదువుతున్నాడు---సూప్---స్పెషల్ టర్టిల్ సూపు-- ఫ్రెంచి ఫ్రై --చికెన్ -- వరుసగా ఏవేవో! ఆయన మామూలుగా చదివి కార్డు పక్కన పెట్టాడు.

బేరర్ ముందుగా సూప్ తెచ్చాడు. బౌల్ నుండి మంచి వాసనలు వస్తున్నవి ఏమి సూపిది ...ఇది స్పెషల్...టర్టిల్ సూపు...టర్టిల్...తాబేలు...

ఆ సూపును ఆయన కళ్లు పెద్దవి చేసి చూచాడు.

అందులో ఆయనకో వాలిన మెడ, దాని కంటిన చిన్న తల, ఆ తలలో అరిగిన గోళీలవంటి రెండు కనులు...వాటి నుండి చుక్కలు ...కరిగిన లోహపు ధారలకు పెరిగిన నెత్తుటి చుక్కలు...

ఆ సూపు బౌలు పక్కకు పెట్టేశారు.

చీఫ్ యింజనీరు చటర్జీగారు గబ గబా గ్లాసుడు మంచినీళ్లు త్రాగి టేబిలు నుండి లేచిపోయారు.